క్లుప్తంగా

నిత్యావసర వస్తువులు సక్రమంగా పంపిణీ చేయాలి

చేబ్రోలు: నిత్యావసర వస్తువులు సక్రమంగా పంపిణీ చేయాలని చేబ్రోలు తహసీల్దారు కె.శ్రీనివాసశర్మ తెలిపారు. చేబ్రోలు తహసీల్దారు కార్యాలయంలో గురువారం మండల పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. తహసీల్దారు శ్రీనివాసశర్మ మాట్లాడుతూ రేషన్ సరుకులను వాహనం ద్వారా కార్డుదారుని ఇంటి వద్దకు వెళ్లి అందజేయాలని చెప్పారు. ప్రతి బజారులో ఐదు చోట్ల నిలిపి సరఫరా చేయాలని సూచించారు. రేషన్ పంపిణీలో అవకతవకలు జరిగితే సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరానికి స్పందన



పెదకాకాని: మండలంలోని తక్కెళ్లపాడులో కోస్టల్ బ్యాంక్ బ్రాంచి 25 సంవత్సరాల సిల్వర్ జూబ్లీ పురస్కరించుకుని ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్యసేవలు అందించారు. దంత సమస్యలు ఉన్న వారికి ఉచితంగా మౌత్‌వాష్, టూత్‌పేస్ట్, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ కంభంపాటి ఆంజనేయులు, సిబార్ దంత కళాశాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంటల బీమాతో పలు ఉపయోగాలు



చినలింగాయపాలెం(కాకుమాను): పంటల బీమాతో పలు ఉపయోగాలు ఉన్నాయని, రైతులంతా చేయించుకోవాలని ఏఓ కె.కిరణ్మయి సూచించారు. మండలంలోని చినలింగాయపాలెం,కె.బి.పాలెం గ్రామాలలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు పంటల బీమా నమోదు పొడిగించినట్లు తెలిపారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనందున, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. సాధ్యమైనంత వరకు ధాన్యాన్ని తేమ శాతం 17లోపు ఉండే విధంగా చూసుకుని గ్రామాలలో ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాలలో విక్రయించుకోవాలని ఆమె తెలిపారు.కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాపారుల అభ్యున్నతికి కృషి



నగరంపాలెం: వ్యాపారుల అభ్యున్నతికి కృషి చేస్తానని ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) అధ్యక్ష అభ్యర్థి యేల్చూరి వెంకటేశ్వర్లు అన్నారు. పట్నంబజార్, ఏలూరిబజార్, బండ్లబజార్, వాసవీ కాంప్లెక్స్ సముదాయాల్లో గురువారం ఓట్లను అభ్యర్థించారు. ఈనెల 28న జరగనున్న ఎన్నికల్లో తనకు, ప్యానెల్ సభ్యులకు ఓట్లేసి గెలిపించాలని ఆయన కోరారు. వ్యాపారుల అభ్యున్నతే ధ్యేయంగా పని చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో చాంబర్ మాజీ ఉపాధ్యక్షుడు వెచ్చా కృష్ణమూర్తి, నాయకులు కొనకళ్ల సత్యం, టీవీఎల్.వీరాంజనేయులు, నాగేశ్వరరావు, రామిరెడ్డి, సదాశివయ్య, వ్యాపారులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసంతో నగదు చోరీ

లక్ష్మీపురం: ఆమెజాన్‌లో ఆర్డర్ పెట్టి అది నచ్చక తిరిగి పంపించే పద్ధతి కోసం ఆన్‌లైన్‌లో ఓ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయగా విడతల వారీగా ఖాతాలోంచి రూ.29,900 చోరీ జరిగింది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్తంభాల గరువు అంజిరెడ్డి వీధి ప్రాంతానికి చెందిన ఉస్మాన్ సయ్యద్ ఆన్‌లైన్ ఆమెజాన్‌లో ఒక వస్తువును ఆర్డర్ చేశాడు. వస్తువు ఇంటికి వచ్చిన తరువాత తీసి చూసేసరికి అనుకున్న స్థాయిలో లేకపోవడంతో తిరిగి పంపించడం అర్థం కాలేదు. దీంతో గూగుల్ హెల్ప్‌లైన్ నంబర్ 756979578 నంబర్‌కు ఫోన్ చేశాడు. ఆ నంబర్‌గల వ్యక్తి వస్తువును ఎలా తిరిగి పంపించాలో చెప్పడం ప్రారంభించాడు. అలా చెబుతున్న సమయంలో బాధితుడు ఉస్మాన్ సయ్యద్ బ్యాంకు ఖాతా నుంచి విడతల వారీగా రూ.29,900 నగదు కట్ అయింది. దీంతో బాధితుడు తిరిగి హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసినా సమాధానం చెప్పడం లేదు. దిక్కుతోచక ఉస్మాన్ సయ్యద్ పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బలహీనవర్గాల ఆశాజ్యోతి వంగవీటి రంగా

వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు వంగవీటి మోహనరంగా అని అంబటి మురళీకృష్ణ కొనియాడారు. వంగవీటి రంగా వర్ధంతి సందర్భంగా పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి ప్రజల హృదయాల్లో చిరస్థాయిలో నిలిచిన గొప్పవ్యక్తి వంగవీటి రంగా అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భవనం పద్మలీల, తాళ్లపాలెం సర్పంచి చుండూరు వీరయ్య, పార్టీ నాయకులు ఆకుల వెంకటేశ్వరరావు, షేక్ నాజర్, బొనిగల వేణుప్రసాద్, అంబటి వెంకటేశ్వరరావు, వట్టిప్రోలు రంగారావు, ఎందేటి వెంకట సుబ్బయ్య, కె. సుషోబిత, దేవరకొండ గోపి పాల్గొన్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం

పెదకాకాని: అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తి వంగవీటి రంగా అని కాపు సంఘం నాయకుడు బందెల ఉదయ్‌శంకర్ అన్నారు. పెదకాకాని సెంటర్‌లో గురువారం మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా 36వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయ్ మాట్లాడుతూ కార్మికులు, పేదల సమస్యల పరిష్కారం కోసం పోరాడి వంగవీటి మోహన రంగా పేదల పక్షపాతిగా నిలిచిపోయారని తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు ఎనలేని సేవ చేశారన్నారు. రంగా ఆశయాల కోసం పాటు పడుతూ ఆయన బాటలో నడవాలని చెప్పారు. కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు మండలనేని శ్రీనివాసరావు, గుమ్మాల శివన్నారాయణ, కాటం వెంకట్రావు, సిద్ధు, కంకణాల గోపి, యడ్లపల్లి సత్యన్నారాయణ, అప్పికట్ల పోతురాజు, మైలా బుజ్జి, రాగం అశోక్, బండారు శ్రీనివాసరావు, తోట సాంబశివరావు, మునగా సత్యనారాయణ, తడవర్తి కోటేశ్వరరావు, గోపీచంద్, గోపి, మధు, కోనా ప్రసాద్ పాల్గొన్నారు.



రంగా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అంబటి మురళీకృష్ణ, నాయకులు



పెదకాకానిలో పూలమాలలు వేస్తున్న కాపు సంఘం నాయకులు

ప్రజా సమస్యలపై సీపీఐ అలుపెరగని పోరాటం

ప్రత్తిపాడు: వందేళ్లుగా ప్రజా సమస్యలపై సీపీఐ అలుపెరగని పోరాటం చేస్తోందని ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి రామిశెట్టి ఆదేశ్వరరావు అన్నారు. పార్టీ స్థాపించి వందేళ్లు అయిన సందర్భంగా గురువారం నియోజకవర్గ కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో శత వార్షికోత్సవాన్ని నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద సీపీఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామిశెట్టి ఆదేశ్వరరావు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిన నాటి నుండి నేటి వరకు విరామమన్నది లేకుండా ప్రజా సమస్యలపై గళం విప్పుతూనే ఉందని తెలిపారు. వీరోచితమైన పోరాటాలకు పెట్టింది పేరని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మామిడి అంకమ్మరావు, నియోజకవర్గ సహాయ కార్యదర్శి సోమేపల్లి వీరాంజనేయులు, ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి జి. ప్రవీణ్, పార్టీ నాయకులు మేడా తాతారావు, వెంకట్రావు, గోపిరెడ్డి నాగిరెడ్డి, వీరారావు, చెక్క చెన్నయ్య, రైతు నాయకులు వీరయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదకాకాని సెంటర్‌లో వేడుకలు

పెదకాకాని: సీపీఐ శతజయంతి ఉత్సవాలలో భాగంగా గురువారం పెదకాకాని సెంటర్లో నాయకులు జెండా ఆవిష్కరించారు. కార్యక్రమానికి పార్టీ గ్రామ కార్యదర్శి పాటిబండ్ల డేవిడ్ రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం భారతీయ కమ్యూనిస్టు పార్టీ అనేక పోరాటాలు చేసిందని తెలిపారు. గుంటూరు జిల్లా రైతు సంఘం అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అలవి గాని ఎన్నికల వాగ్దానాలు చేసి, ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ఆరు డిమాండ్లను కూడా తీర్చలేని పరిస్థితిలో పడిపోయిందని తెలిపారు. ప్రజలు ఇప్పటికైనా ఆలోచించి రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పి ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి రెంటాల కుమారి, వెనిగండ్ల గ్రామ సీపీఐ కార్యదర్శి బుల్లా బాబురావు, నంబూరు కార్యదర్శి కూసం నాగిరెడ్డి దర్శి లింగారావు, రామిశెట్టి శ్రీనివాసరావు, షేక్ బాసిదు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నియోజకవర్గ కార్యదర్శి ఆదేశ్వరరావు, పార్టీ నాయకులు



పెదకాకాని సెంటర్‌లో జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

నేటి నుంచి ఆర్‌వీఆర్‌జేసీలో కొలరిడో- 2024 ఫెస్ట్

గుంటూరు రూరల్: తమ కళాశాలలో ఈ నెల 27, 28వ తేదీల్లో రెండు రోజుల పాటూ కొలరిడో- 2024 పేరుతో సాంకేతిక, సాంస్కృతిక, క్రీడల విభాగాలలో జాతీయ స్థాయిలో విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని తెలిపారు. చౌడవరం గ్రామంలోని కళాశాలలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గురువారం వారు మాట్లాడారు. పోటీలలో దేశంలోని వివిధ కళాశాలల నుంచి 5,000 మందికిపైగా విద్యార్థులు పాల్గొంటున్నారని, విజేతలుగా నిలిచిన విద్యార్థులకు రూ. 5 లక్షల వరకు నగదు బహుమతులను అందించనున్నట్లు తెలిపారు. తొలిరోజు శుక్రవారం జరిగే కొలరిడో-2024 ఫెస్ట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా టీసీఎస్ కంపెనీ సీనియర్ కన్సల్టెంట్, డెలివరీ పార్టనర్ ఎమ్.ఎస్.ఆర్. మూర్తి, విశిష్ట అతిథులుగా తెలుగు సినీ తారలు హాజరు కానున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్ తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరు కానున్న విద్యార్థులకు అవసరమైన అన్ని వసతి సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎస్.వి.శ్రీనివాసరావు, కల్చరల్ కమిటీ ఇంచార్జి కన్వీనర్ రంగరాయ చౌదరి, సభ్యులు పాల్గొన్నారు.

రెవెన్యూ అర్జీలకు సత్వర పరిష్కారం

పొన్నూరు: రెవెన్యూ సంబంధిత సమస్యలపై ప్రజల నుంచి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తహసీల్దార్ జియావుల్‌హక్ అన్నారు. గురువారం మండలంలోని చింతలపూడి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి ఆయన 53 అర్జీలను స్వీకరించారు. మ్యుటేషన్ కోసం- 14, రిప్లేస్‌మెంట్ పాస్ బుక్ కోసం- 3, ఎఫ్‌లైన్- 27, అడంగల్ కరక్షన్- 1, ఎఫ్‌ఎంసీ- 2, డిజిటల్ సిగ్నేచర్- 4, క్యాస్ట్ -1, ఇన్‌కమ్ సర్టిఫికెట్ కోసం 1 అర్జీ స్వీకరించామని తెలిపారు. వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను తహసీల్దార్ జియావుల్‌హక్ ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ రాజా రమేష్, సర్వేయర్ సత్యనారాయణ, ఆర్‌ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.



మహిళ నుంచి అర్జీ తీసుకుంటున్న తహసీల్దార్ జియావుల్‌హక్

వెండి తెరకు వాస్తవికత అద్దిన శ్యామ్ బెనెగల్



లక్ష్మీపురం: మట్టి మనుషుల జీవిత గాథలతో వెండి తెరకు కొత్త సొబగులు అద్దిన శ్యామ్ బెనెగల్ మరణంతో భారతీయ చలన చిత్ర పరిశ్రమలో ఒక అధ్యాయం ముగిసిందని సంగీత విద్వాంసులు వి.ఎస్.ఎన్. మల్లేశ్వరరావు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం సినీ దర్శకుడు శ్యామ్ బెనెగల్ సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ కమర్షియల్ హంగులతో ఆకాశపు హద్దులు దాటే బాలీవుడ్ చిత్రాలను శ్యామ్ బెనెగల్ నేలకు దించారని తెలిపారు. కార్యక్రమంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, గాయకులు రామకృష్ణారెడ్డి, యార్లగడ్డ లక్ష్మీ, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

త్వరలో ‘పది’ విద్యార్థులకు అల్పాహారం

సాక్షి ఎఫెక్ట్

ప్రత్తిపాడు: త్వరలో పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సి. వి. రేణుక తెలిపారు. విద్యార్థులకు అల్పాహారం అందించకపోవడంతో ఉదయం, సాయంత్రం నిర్వహించే ప్రత్యేక తరగతుల్లో నీరసించి ఏకాగ్రత కోల్పోతున్నారంటూ గురువారం ‘సాక్షి’లో ప్రచురితమైన అల్పా ‘హాహాకారం’తో అవస్థలు కథనంపై జిల్లా విద్యాశాఖాధికారి స్పందించారు. జిల్లా పరిషత్, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లోని పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించే నిమిత్తం జిల్లా పరిషత్ యాజమాన్యాన్ని, మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపల్ అధికారులను కోరామని, వారి సహకారంతో త్వరలోనే పది విద్యార్థులకు అల్పాహారం అందిస్తామని చెప్పారు. అప్పటివరకు దాతల సహకారంతో విద్యార్థులకు అల్పాహారం అందించేలా చూడాలని ప్రధానోపాధ్యాయులకు సూచించామని తెలిపారు. దాతల సహకారంతో కొన్ని పాఠశాలల్లో అల్పాహారం అందిస్తున్నారని, ఇది అభినందనీయమని డీఈవో పేర్కొన్నారు.

నిబంధన మేరకు నిర్మాణాలు చేపట్టాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: బహుళ అంతస్తుల భవనాలు నిబంధన మేరకు నిర్మాణాలు చేపట్టాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. రోడ్ల మీదకు ర్యాంప్‌లు, డ్రైయిన్లపై నిర్మాణాలు చేపట్టరాదని తెలిపారు. డ్రైనేజీ లైన్‌ని మేజర్ డ్రైన్‌లోకి కనెక్ట్ చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేసిన భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) జారీ చేయబోమని ఆయన స్పష్టం చేశారు. ఆయన గురువారం గోరంట్లలో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాన్ని పరిశీలించారు. సెట్ బ్యాక్, రోడ్ల కొలతలు, ర్యాంప్‌లు, డ్రైయిన్లపై ఆక్రమణలను తనిఖీ చేసి, తర్వాత అనుమతులకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భవనాలు నిర్మాణ దశలోనే వార్డ్ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు నిరంతరం పరిశీలించాలని ఆదేశించారు. నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టకపోతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి, నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. రోడ్ల మీదకు ర్యాంప్‌లు, డ్రైయిన్లపై ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే నిర్మాణం చేసిన వాటిని తొలగించాలని స్పష్టం చేశారు. ప్రధానంగా సెట్ బ్యాక్ పోర్షన్‌లో ఏ విధమైన నిర్మాణాలు చేయకూడదని, జనరేటర్లు పెట్టడానికి వీల్లేదని స్పష్టం చేశారు. గ్రీనరీకి ప్లాన్‌లో చూపిన విధంగా ఉండాలన్నారు. వాచ్ మేన్ రూమ్ నగరపాలక సంస్థ నుంచి అనుమతి పొందిన ప్లాన్ ప్రకారమే ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పర్యటనలో అసిస్టెంట్ సిటీప్లానర్ మల్లికార్జున, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.



భవన కొలతలు పరిశీలిస్తున్న కమిషనర్

ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణపై దృష్టి సారించాలి

నెహ్రూనగర్: రోజురోజుకీ పెరుగుతున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో గురువారం కేటీపీ ఫౌండేషన్ ఈ-వ్యర్థాల నిర్వహణపై రూపొందించిన వాల్‌పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణలో కేటీపీ ఫౌండేషన్ కృషి అభినందనీయమని తెలిపారు. రతన్ టాటా జయంతి సందర్భంగా ఈనెల 28న బృందావన్ గార్డెన్స్‌లోని క్రోమా షోరూమ్‌లో ఎలక్ట్రానిక్ వ్యర్థాలు అందిస్తే కేటీపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారి పేరుతో ఒక మొక్కను నాటి, ఈ-సర్టిఫికెట్ అందిస్తారని తెలిపారు. నగర ప్రజలు తమ ఇంటిలో వినియోగంలో లేని మొబైల్స్, కంప్యూటర్లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అందించి పర్యావరణ పరిరక్షణలో భాగాస్వాములు కావాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో కేటీపీ ఫౌండేషన్ చైర్మన్ బి.నిశ్చల్ పాల్గొన్నారు.

‘విద్యుత్’ పోరుబాటను జయప్రదం చేయాలి

వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలకు కరెంటు షాక్ ఇస్తున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు శుక్రవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన పోరుబాటకు మద్దతుగా భారీగా ప్రజలు తరలిరావాలని పార్టీ పొన్నూరు నియోజకవర్గం సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కరెంటు చార్జీలు పెంచబోమని, ట్రూ ఆప్ చార్జీలు తీసివేస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చిన చంద్రబాబు.. అధికారం చేపట్టిన కేవలం ఆరు నెలల్లోనే ప్రజలపై రూ. కోట్ల విద్యుత్ భారం మోపారని మండిపడ్డారు. ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ శుక్రవారం నిరసన తెలపనున్నట్లు చెప్పారు. ఉదయం పది గంటలకు పొన్నూరు పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి విద్యుత్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని మురళీకృష్ణ కోరారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ

నేడు ప్రత్తిపాడులో వైఎస్సార్ సీపీ పోరుబాట

గుంటూరు రూరల్: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచి పేద ప్రజలను నిలువునా మోసం చేసినందుకు నిరసనగా శుక్రవారం వైఎస్సార్ సీపీ పోరుబాట నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు నియోజకవర్గ ఇంచార్జ్ బలసాని కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటలకు ప్రత్తిపాడు గ్రామ నడిబొడ్డునగల వైయస్ఆర్ విగ్రహం నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి, నిమ్మగడ్డవారిపాలెం రోడ్డులో గల విద్యుత్ కార్యాలయంలోవినతి పత్రం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

స్వయం ఉపాధి యూనిట్లతో మహిళల ఆర్థికాభివృద్ధి

ప్రత్తిపాడు: మహిళల ఆర్థికాభివృద్ధికి స్వయం ఉపాధి యూనిట్లు ఉపకరిస్తాయని డీఆర్‌డీఏ పీడీ టి.వి. విజయలక్ష్మి అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జాయింట్ మండల లెవల్ బ్యాంకర్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబాలు ఆర్థిక పరిపుష్టిని సాధిస్తాయని తెలిపారు. స్వయం సిద్ధ ప్రాజెక్టు కింద స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పుకునేందుకు బ్యాంకర్ల ద్వారా మహిళలకు విరివిగా రుణాలు ఇవ్వాలని కోరారు. వ్యవసాయ ఆధారిత డ్రోన్లకు ఎనభై శాతం వరకు రాయితీలు ఉన్నాయన్నారు. డ్రోన్ పైలట్ ప్రాజెక్టులను ప్రోత్సహించే విధంగా బ్యాంకర్లు రుణాలిచ్చి చొరవచూపాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఆయా శాఖల బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి

ప్రయాణికురాలిని బెదిరించి దారి దోపిడీ

ఆటోను దారి మళ్లించి బంగారం, నగదు, సెల్‌ఫోన్ దోచుకున్న దొంగలు

చేబ్రోలు: ఆటోలో మహిళా ప్రయాణికురాలిని బెదిరించి ఆమె నుంచి బంగారం, నగదు, ఫోన్‌ను అపహరించుకుపోయిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు చేబ్రోలు ఎస్‌ఐ డి. వెంకటకృష్ణ గురువారం తెలిపారు. తెనాలి ప్రాంతానికి చెందిన యువతి గుంటూరులోని ఆటోమొబైల్ కంపెనీలో పని చేస్తోంది. 24వ తేదీ సాయంత్రం ఆఫీసులో పని ముగించుకొని తెనాలిలోని ఇంటికి వెళ్లటానికి బ్రహ్మానందరెడ్డి స్టేడియం వద్దకు చేరుకుంది. కొద్దిపాటి వర్షం పడుతుండటంతో తెనాలి వెళ్తున్న ఆటోలో బయలు దేరింది. మార్గం మధ్యలో నారాకోడూరు గ్రామ సమీపంలోని కారం మిల్లు వద్దకు వచ్చే సరికి ఆటో డ్రైవర్‌తో పాటు అందులోనే ఉన్న మరో వ్యక్తి వర్షం పడకుండా పట్టా అడ్డు కడుతున్నట్లు నటిస్తూ వేజండ్ల వెళ్లే డొంక రోడ్డులోనికి పోనిచ్చారు. ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు, బ్యాగ్, సెల్‌ఫోన్‌ను లాక్కోవటంతో బలవంతంగా ఆటో దూకి జీబీసీ ప్రధాన రహదారి మీదకు చేరుకుంది. అక్కడ రాకపోకలు సాగించే వారికి సమాచారం తెలియజేయడంతో పాటు డయల్ 100కు ఫోన్ చేసి దొంగతనం సమాచారాన్ని తెలిపింది. నారాకోడూరు ట్రాఫిక్ డ్యూటీలో ఉన్న ఎస్‌ఐ డి. వెంకటకృష్ణ, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని ఆటోలో పరారవుతున్న వారిని వెంబడించారు. వారు పొలాల్లోకి ఆటోను పోనిచ్చి అక్కడ నుంచి వారు తప్పించుకొని పరారయ్యారు. ఆటోను పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆటో నంబరు, సీసీ కెమెరాలు, ఇతర సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించారు. ఇద్దరూ నారాకోడూరు, పాతరెడ్డిపాలేనికి చెందిన వారిగా గుర్తించారు. అదుపులోకి తీసుకొని వారిని అరెస్ట్ చేయడానికి పోలీసులు గాలిస్తున్నారు. యువతి ఫిర్యాదు మేరకు చేబ్రోలు ఎస్‌ఐ డి. వెంకటకృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నెలాఖరు వరకు పంటల బీమా నమోదుకు గడువు

పొన్నూరు: మండలంలోని రైతులు నెలాఖరులోపు పంటల బీమా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి డేగల వెంకట్రామయ్య తెలిపారు. గురువారం మండలంలోని ములుకుదురు, మాచవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో పంట నమోదుతో కలిగే ప్రయోజనాలు వివరించారు. మినుము, పెసర, జొన్న, మొక్కజొన్న పంటలకు రైతులు ప్రీమియం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. దీనికి తొలుత రైతు సేవా కేంద్రం నుంచి సాగుదారు పత్రం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది పి. తిరుపతమ్మ, డి.వి. సుబ్బారావు, సురేష్‌బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏవో వెంకట్రామయ్య

అయ్యప్ప ఆలయంలో వైభవంగా మండల పూజ



పంచామృతాలతో స్వామికి అభిషేకం



హోమంలో పాల్గొన్న భక్తులు

నగరంపాలెం: స్థానిక మల్లారెడ్డి నగర్ శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి దేవాలయంలో 14వ మండల పూజ మహోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అష్ట ద్రవ్య గణపతి హోమం, నవకలశారాధన, అయ్యప్ప స్వామికి మహాకలశాభిషేకం, హోమం, పూర్ణాహుతిని ఆలయ పూజారులు శివకుమార్‌శర్మ, చంద్రశేఖర్‌శర్మ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అయ్యప్ప మాలాధారులకు, భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం గురుస్వామి కె.రాము (విజయవాడ) ఆధ్వర్యంలో పదునెట్టాంబడి పూజ, మార్కాపురం శ్రీనుస్వామి భజన నిర్వహించారు. అనంతరం అయ్యప్పస్వామికి కన్నుల పండువగా పుష్పాభిషేకం, మహా హారతి జరిగాయి. రాత్రి భిక్షతో ముగిసింది. కార్యక్రమంలో ఎంకేఆర్ అయ్యప్పస్వామి ఫౌండేషన్ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి, అన్నదాన కమిటీ చైర్మన్ గుంటూరు వేమారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సఖి వన్ స్టాప్ సెంటర్ తనిఖీ

నెహ్రూనగర్: మహిళా ప్రాంగణంలోని సఖి వన్ స్టాప్ సెంటర్‌ను ఏపీ మహిళా కమిషన్ మెంబర్ బూసి వినీత గురువారం తనిఖీ చేశారు. కేంద్రంలో బాధితులకు అందుతున్న సహాయం, రికార్డ్స్, షెల్టర్ రూమును పరిశీలించారు. అనంతరం గొడవల పడి కేంద్రానికి వచ్చిన భార్యాభర్తలకు కౌన్సిలింగ్ ఇచ్చారు.